ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
ఆదివారం 7 డిసెంబరు 2025



మూడో విడతలో 3,010 నామినేషన్లు దాఖలు

పెద్దపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ల గడువు ముగిసే నాటికి 91 సర్పంచ్ స్థానాలకు 645 మంది అభ్యర్థులు, 851 వార్డు స్థానాలకు 2,365 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. సుల్తానాబాద్ మండలం బొంతకుంటపల్లి పంచాయతీ పరిధిలోని 3వ వార్డుకు ఒక్కరు కూడా నామినేషన్ దాఖలు చేయలేదు. ఎలిగేడు మండలంలో 12 పంచాయతీల్లో సర్పంచ్‌కు 82 మంది, 114 వార్డులకు 299 మంది, ఓదెల మండలంలో 22 పంచాయతీల్లో సర్పంచ్‌కు 156 మంది, 198 వార్డు స్థానాలకు 554 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. పెద్దపల్లి మండలంలో 30 పంచాయతీల్లో సర్పంచ్‌కు 207 మంది, 294 వార్డు స్థానాలకు 830 మంది, సుల్తానాబాద్ మండలంలో 27 పంచాయతీల్లో సర్పంచ్‌కు 200 మంది, 246వార్డు స్థానాలకు 682 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని డీపీవో వీరబుచ్చయ్య తెలిపారు. శనివారం నామినేషన్ల పరిశీలన జరిగింది. నామి నేషన్ల ఉపసంహరణకు ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఉంది.

రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడి పర్యటన



ఎలిగేడులో ఎన్నికల క్లస్టర్‌ను పరిశీలిస్తున్న నర్సింహారెడి

ఎలిగేడు, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): ఎలిగేడు, సుల్తాన్‌పూర్ గ్రామపంచాయతీ ఎన్నికల క్లస్టర్‌లను రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు, అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి శనివారం సందర్శించారు. ఎన్నికల క్లస్టర్లలో నామినేషన్ల స్క్రూటినీ తీరును పరిశీలించారు. సర్వీస్ ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ అభ్యర్థుల ఎన్నికల ఖర్చు పట్టిక సమర్పణపై అధికారులకు వివరించారు. తహసీల్దార్ యాకయ్య, ఎంపీడీఓ భాస్కర్ రావు, ఎన్నికల అధికారులు ఉన్నారు.

- ఇంటింటికి తిరుగుతూ ఓటు అడుగుతున్న అభ్యర్థులు
- ఉదయం, సాయంత్రం వేళలోనే ముమ్మర ప్రచారం
- ఖర్చు విషయంలో ఆచితూచి అడుగులు

పల్లెల్లో ఊపందుకుంటున్న ప్రచారం



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో పల్లెల్లో ఎన్నికల ప్రచారం ఊపందుకుంటోంది. పోటాపోటీగా అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికి తిరుగుతూ తమకే ఓటు వేయా లంటూ వేడుకుంటున్నారు. తాను గెలిస్తే గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని, గ్రామ ప్రజలకు అం దుబాటులో ఉంటానని అనేక వాగ్దానాలు గుప్పిస్తు న్నారు. కొన్ని గ్రామాల్లో సాధ్యం కాని హామీలు ఇస్తూ ఓటర్లను ఆకర్శించేందుకు యత్నిస్తున్నారు. ఖర్చు చేయ డంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. వ్యవసాయ పనుల సీజన్ కావడంతో పొద్దంతా రైతులు, మహిళలు ఇళ్లల్లో ఉండడం లేదు. వరి నాట్లు వేసేందుకు, పత్తి ఏరేందుకు వెళుతున్నారు. దీంతో అభ్యర్థులు తెల్లవారు జాము ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు.

మొదటి విడతలో మండలాలు...

జిల్లాలో 263 గ్రామ పంచాయతీలు, 2432 వార్డులు ఉన్నాయి. మొదటి విడతలో మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లోని 99 గ్రామ పంచాయతీల సర్పంచ్, 896 వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. సర్పంచ్ కోసం 471 మంది, వార్డు స్థానాల కోసం 2565 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 3న నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి మంథని మండలం నాగారం, ఖైదుపల్లి, తోటగోపయ్యపల్లి, రామగిరి మండలం చందనాపూర్ గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. తోటగోపయ్యపల్లి సర్పంచ్‌తో పాటు ఆరు వార్డు స్థానాలు కూడా ఏకగ్రీవమయ్యాయి. ముత్తారం మండంలో 17 వార్డులు, కాల్వశ్రీరాంపూర్ 79 వార్డులు, మంథని మండలంలో 81 వార్డులు, కమాన్‌పూర్‌లో 11 వార్డులు, రామగిరి మండలంలో 23 వార్డులు ఏకగ్రీవం అయ్యాయని డీపీవో వీర బుచ్చయ్య తెలిపారు. దీంతో 95 పంచాయతీల సర్పంచ్ స్థానాలతోపాటు 98 పంచాయతీల్లోని 685 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. సర్పంచ్ కోసం 376 మంది, వార్డు సభ్యుడి కోసం 1880 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

ప్రచారం ఇలా...

మొదటి విడత అభ్యర్థులకు గుర్తులు కేటాయించడంతో డోర్ పోస్టర్లు, కరపత్రాలు, తదితర ప్రచార సామగ్రి ముద్రించుకుని ప్రచారం నిర్వహిస్తున్నారు. రెండో విడత ఎన్నికలు జరిగే అంతర్గాం, పాలకుర్తి, ధర్మారం, జూలపల్లి మండలాల్లో నామినేషన్ల ఉపసంహరణకు శనివారం నాటితో గడువు ముగిసింది. దీంతో పోటీ చేసే అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. సదరు అభ్యర్థులు ఆదివారం నుంచి ప్రచార పర్వంలో దిగను న్నారు. మూడో విడత ఎన్నికలు జరగనున్న సుల్తానా బాద్, పెద్దపల్లి, ఓదెల, ఎలిగేడు మండలాల్లో నామినే షన్ల పరిశీలన ముగియగా, ఈ నెల 9న ఉపసంహరణ అనంతరం గుర్తులు కేటాయించనున్నారు. మొదటి విడత పోలింగ్ ఈ నెల 11న, రెండో విడత 14న, మూడో విడత 17న పోలింగ్ జరగనున్నది.

ఇంటింటికి తిరుగుతూ..

జిల్లాలో ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల మధ్యనే పోటీ జరుగుతున్నది. కొన్ని చోట్ల బీజేపీ అభ్యర్థులు పోటీ

(మిగతా 8వ పేజీలో)

శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ



చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీ వివరాలు ఆరా తీస్తున్న సీపీ

సుల్తానాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శాంతియుత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించడమే లక్ష్యంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. జిల్లా సరిహద్దు దుబ్బపల్లి వద్ద ఏర్పాటు చేసిన స్టాటిక్ సర్వేలేయన్స్ చెక్ పోస్టును సీపీ శనివారం సందర్శించి వాహనాల తనిఖీని పర్య వేక్షించారు. సీఐ సుబ్బారెడ్డితోపాటు విధులు నిర్వహిస్తున్న పోలీసులతో మాట్లాడుతు ఓటర్లను ప్రలోభపెట్టే విధంగా నగదు, మద్యం ఇతర వస్తువుల అక్రమ రవాణాకు యత్నించే వారిపై ఎన్నికల నియామళి ప్రకారం కేసులు నమోదు చేయాలని సూచించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. సిబ్బంది జాగ్ర త్తలు పాటించాలని, రేడియం జాకెట్స్ ధరించాలని, లైట్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం గర్రెపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పలు కేంద్రాలను పరిశీలించారు. సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాల గురించి సమాచారం సేకరించి అవాంఛనీయమైన ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

శాంతిభద్రతల పరిరక్షణలో హోంగార్డుల పాత్ర కీలకం



హోంగార్డుల పరేడ్‌ను పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో, ప్రజాభద్రతలతో హోంగార్డుల పాత్ర కీలకమని, వారి త్యాగాలు, బలిదానాలు మరువలేనివని పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. శనివారం హోంగార్డ్ రైజింగ్ డే సందర్భంగా కమిషరేట్ పరేడ్ గ్రౌండ్ గౌరవ వందనం స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ హోంగార్డుల సేవలు ప్రశంసనీయమని, శాంతి భద్రతలు, ట్రాఫిక్, కమ్యూనిటీ పోలీస్, క్రైమ్ నివారణ, విపత్తుల నివారణ వంటి విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. హోంగార్డులు బాధ్యతగా నిర్వహిస్తూ క్రమశిక్షణ, సేవా స్ఫూర్తి ప్రదర్శిస్తూ పోలీస్‌శాఖకే గర్వకారణంగా నిలుస్తున్నారన్నారు. విధి నిర్వహణలో ప్రతిభకనబరిచిన హోంగార్డులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. పరేడ్ కమాండర్‌గా హోంగార్డ్ ఆర్ఐ పెద్దన్న వ్యవహరిం చారు. డీసీపీ(అడ్మిన్) శ్రీనివాస్, ఎస్‌బీ ఏసీపీ నాగేం ద్రగౌడ్, ఏఆర్ ఏసీ పీ ప్రతాప్, ఎస్‌బీఐ భీమేష్, ఆర్ఐలు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

ధర్మారంలో ముగ్గురు సర్పంచ్‌లు ఏకగ్రీవం

పాలకుర్తి/అంతర్గాం, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): పాలకుర్తి, అంతర్గాం మండలాల్లో శనివారం నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది. పాలకుర్తి మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు ఉపసంహరణ అనంతరం 67 మంది, 156 వార్డులకు 384 మంది బరిలో ఉన్నారు. 16 వార్డులు ఏకగ్రీవమయ్యాయని అధికారులు తెలిపారు. అంతార్గంలో మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు 71 మంది, 132 వార్డులకు 93 మంది ఎన్నికల బరిలో నిలిచారు. 38 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయని అధికారులు తెలిపారు.

ఎలిగేడు/జూలపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 గ్రామా ల్లో గ్రామపంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ల వేసిన అభ్యర్థులు 18 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవమైనట్లు ఎంపీడీఓ భాస్కర్ రావు తెలిపారు. సర్పంచ్ స్థానాలకు 47 మంది, వార్డు స్థానాలకు 269 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

జూలపల్లి మండలంలో 13 గ్రామపంచాయతీలకు గాను 44 మంది సర్పంచ్ అభ్యర్థులు, 130 వార్డులకు 227 మంది బరిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. 35 మంది వార్డు సభ్యులు ఏకగ్రీమయ్యారని పేర్కొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): మండలంలో 29 గ్రామపం చాయతీలకు గాను 3 ఏకగ్రీవం కాగా 101 మంది బరిలో ఉన్నారు. అలాగే 266 వార్డులకు 28 వార్డులు ఏకగ్రీవమయ్యాయి.

ధర్మారం మండలంలో ముగ్గురు సర్పంచులు ఏకగ్రీవమయ్యారు. బంజేరుపల్లి గ్రామానికి చెందిన కళ్ళెం ఇందిరా, బొట్లవనపర్తికి చెం దిన సంగ రంజిత్ యాదవ్‌లు కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులు కాగా, నాయకంపల్లికి చెందిన పైనేని రవి బీఆర్ఎస్‌కు చెందిన అభ్యర్థి. ఏకగ్రీవమైన కాంగ్రెస్ అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఎంసీ రూప్లానాయక్, పార్టీ అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మెన్ కొత్త నర్సింహులు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

కారుణ్య నియామకాల రద్దుకు కుట్ర



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కారుణ్య నియామకాలను రద్దు చేసే కుట్ర జరుగుతుందని, రెండు సంవత్సరాలుగా మెడికల్ బోర్డుకు వెళుతున్న కార్మికులను అన్‌ఫిట్ చేయకుండా యాజమాన్యం కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తుందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. శనివారం ఆర్‌జీ-1 జీఎం కార్యాలయం ఎదుట టీబీజీకేఎస్ ఆర్‌జీ-1 ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్ ఆధ్వర్యంలో దీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గతంలో ఉన్న మెడికల్ బోర్డును నిర్వీర్యం చేస్తూ కార్మికులను అన్‌ఫిట్ చేయడం లేదని, తొమ్మిది నెలలుగా మెడికల్ బోర్డు పెట్టడం లేదన్నారు. మొక్కుబడిగా పెట్టిన రెండు మెడికల్ బోర్డులో కొందరికే మెడికల్ అన్‌ఫిట్ చేశారని, మిగతా కార్మికులకు అన్యాయం చేశారన్నారు. కేసీఆర్ పది సంవత్సరాల పాలనలో సింగరేణి కార్మికులు అడుగకుండానే హక్కులను కల్పించారని, కాంగ్రెస్ సర్కార్ కార్మికులకు అన్యాయం చేస్తుందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సింగరేణి వాస్తవ లాభాల్లో కేవలం 16శాతం వాటానే ఇచ్చి కార్మికులను మోసం చేసిందని, అభివృద్ధి పేరిట రూ.2,289 కోట్లు పక్కన పెట్టిందని, కార్మికులకు ఆదాయ పన్ను మినహాయించి అలవెన్సులపై ఆదాయ పన్నును యాజమాన్యమే భరించాలని డిమాండ్ చేశారు. టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ నెలకు రెండు బోర్డులను నిర్వహించి అనారోగ్యంతో ఉన్న కార్మికులందరిని అన్‌ఫిట్ చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, పుట్ట మధు, నాయకులు కౌశిక హరి, సురేందర్‌రెడ్డి, కాపు కృష్ణ, మాదాసు రామమూర్తి, నూనె కొమురయ్య, పర్లపల్లి రవి, చెల్పూరి సతీష్, సాంబయ్య, బడికెల సంపత్, ఐలి శ్రీనివాస్, ఐ సత్యం, పొలాడి శ్రీనివాసరావుతో పాటు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై శిక్షణ

ముత్తారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా 138 మంది ఎన్నికల అధికారులకు ఎంఇఓ హరిప్రసాద్, రిసోర్స్‌పర్సన్ అంజనీ ప్రసాద్ ఎన్నికలు ఏ విధంగా నిర్వహించాలి, ఎన్నికల సామగ్రిపై వివరించారు. ఎన్నికల పోలింగ్ రోజు వ్యవహరించాల్సిన విధానాలను, ఎన్నికల పోలింగ్ ముగిసిన వెంటనే కౌంటింగ్ చేపట్టే అంశాలపై శిక్షణ ఇచ్చారు. పోలింగ్ సమయంలో ఎలాంటి తప్పులు దొర్లకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎంపిడిఓ సురేష్, మండల స్థాయి అధికారులున్నారు.

రామగిరి: పంచాయతీ ఎన్నికల నిర్వహణ పై సింగరేణి కమ్యూనిటీహాల్‌లో శనివారం ఎన్నికల సిబ్బందికి అవగాహన సదస్సును చేపట్టారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు టీవోటి సిబ్బందికి ఎన్నికల ప్రక్రియపై అవగాహన సదస్సుతో పాటు శిక్షణను చేపట్టారు. ఎంపీడీవో శైలజారాణి, ఎఈవో కొమురయ్య, టీవోటి పురుషోత్తం, సూపరింటెండెంట్ ఉమేష్‌లు పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా కమాన్‌పూర్ మండలానికి కేటాయించిన సుమారు 106 మంది ప్రిసైడింగ్ అధికారులకు శనివారం ఎంఈఓ ఇల్లందుల విజయ్ కుమార్, మాస్టర్ ట్రైనర్స్ రాంరెడ్డి, ఆగయ్యలు శిక్షణ నిచ్చారు. ఎంపీడీఓ ప్రియాంక మాట్లాడుతూ ఎలక్షన్ విధులు సవివరంగా తెలుసుకొని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులపై ఉందని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు, గుండారం కార్యదర్శి, ఎంపీడీఓ సిబ్బంది పాల్గొన్నారు.

కక్షిదారుల సౌలభ్యం కోసమే కోర్టుల ఏర్పాటు

అదనపు కోర్టును ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తులు



మాట్లాడుతున్న హైకోర్టు జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి

సుల్తానాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కక్షిదారుల సౌలభ్యం కోసమే రాష్ట్రంలో నూతన కోర్టుల ఏర్పాటు చేస్తున్నట్లు తద్వారా కేసులు సకాలంలో పరిష్కరించే అవకాశం ఉందని హైకోర్టు జస్టిస్, పెద్దపల్లి జిల్లా ఆడ్మినిస్ట్రేటివ్ జడ్జి లక్ష్మీనారాయణ అలిశెట్టి అన్నారు. సుల్తానాబాద్ కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన అదనపు కోర్టును హైకోర్టు జస్టిస్‌లు లక్ష్మీనారాయణ, పుల్ల కార్తీక్, జె శ్రీనివాసరావులు శనివారం ప్రారంభించారు. సుల్తానాబాద్‌లో జూనియర్ సివిల్ జడ్జి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఉండగా అదనంగా మరో కోర్టును ప్రభుత్వం మంజూరు చేసింది. అదనపు కోర్టును ప్రస్తుత కోర్టు ఆవరణలో ఉన్న భవనంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హైకోర్టు జస్టిస్‌లు మాట్లాడుతు కోర్టుల్లో చాలా కేసులు పెండింగ్ ఉంటున్నాయని, దీంతో దీర్ఘకాలంగా కోర్టుల చుట్టు తిరుగుతు వారు వ్యయ ప్రయాసాలకు గురవుతున్నారని, కక్షిదారుల సౌలభ్యం కోసం, సత్వరంగా న్యాయం అందించడంలో భాగంగా అదనంగా కోర్టులను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కక్షిదారులకు న్యాయవ్యవస్థపై నమ్మకం కలిగించేలా న్యాయవాదులు వృత్తిలో నైపుణ్యతలను పెంచుకోవా లన్నారు. సుల్తానాబాద్ కోర్టుకు విశాలమైన స్థలం ఉందని ఇక్కడ సబ్ కోర్టు, జిల్లా కోర్టును ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతిరెడ్డి వినతి పత్రం అందజేశారు. హైకోర్టు జస్టిస్‌లను సన్మానించారు.రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా వారికి పుష్ప గుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. జిల్లా జడ్జి సునీత కుంచాల, అదనపు జిల్లా జడ్జి టి శ్రీనివాస్‌రావు, జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్, జిల్లాలోని పలువురు జడ్జిలు, డీసీపీ రాంరెడ్డి, బార్ అసోసియేషన్ కార్యదర్శి భూమయ్య, ఏపీపీ శ్యామ్ ప్రసాదరావు, ఏజీపీ దూడం అంజయనేయులు, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నేరెళ్ల శంకరయ్య, సీనియర్ న్యాయవాదులు దివాకర్‌రావు, అంజనేయులు, బాలకిషన్ ప్రసాద్, శ్రీనివాసరావు, వొడ్నాల రవీందర్, శ్రీరాములు,సత్యనారాయణ, సరోత్తంరెడ్డి,ఆవుల శివకృష్ణ, సామల రాజేంద్రప్రసాద్, గుడ్ల వెంకటేష్ పాల్గొన్నారు.

మినీ మేడారంగా ఖని సమ్మక్క - సారలమ్మ జాతర



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గోదావరి తీరంలో సమ్మక్క -సారలమ్మ జాతరను మినీ మేడారంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శనివారం జాతర ప్రాంగణంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. భక్తుల అభీష్టం మేరకు ప్రతిష్టాత్మక చర్యలు చేపట్టామని, జనవరిలో జరిగే జాతరకు పెద్ద ఎత్తున భక్తులు వస్తారన్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా దర్శనం, వసతి, పారిశుధ్య, స్నానఘటాలు అభివృద్ధిని చేస్తున్నట్టు తెలిపారు. నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, నాయకులు గుండేటి రాజేష్, రాజిరెడ్డి, జాతర కమిటీ చైర్మన్ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

కల్వచర్లలో నత్తనడకన వాటర్ పైప్‌లైన్ పనులు

రామగిరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్లలో వాటర్ పైప్‌లైన్ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. గ్రామంలో ఇటీవల రోడ్డు విస్తరణ పనులను చేపట్టారు. దీంతో రోడ్డు వెడల్పు కావడంతో ఇరుపక్కల పాత పైప్‌లైన్ పూర్తిగా దెబ్బతిన్నది. గ్రామ స్థుల తాగు నీటి కోసం ప్రత్యామ్నాయంగా అధికారులు పైప్‌లైన్ పనులు చేపట్టారు. పైప్‌లైన్ పనులకు రూ.25 లక్షల కలెక్టర్ గ్రాంట్ కింద నిధులు మంజూరై పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్ పనులు వేగంగా జరగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాలుగు రోజులకో సారి నత్తనడకన కాంట్రాక్టర్ పనులు చేపడుతున్నట్లు గ్రామస్థుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పైప్‌లైన్ లైనింగ్ పనుల్లో గ్రామస్థుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నప్పటికి మరి కొన్ని ప్రాంతాల్లో పైప్‌లైన్ కోసం చేసిన గుంతలను కాంట్రాక్టర్ పూడ్చ కుండా తాత్సారం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ గృహ లబ్ధిదారులు పైప్‌లైన్ పనుల వల్ల ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. గృహ నిర్మాణ లబ్ధిదారులు గుంతల కారణంగా ముడి సరుకును దిం పుకునేందుకు అడ్డంకిగా మారు తున్నాయి. పైప్‌లైన్ పనులను సత్వరం పూర్తి చేయాల్సిన అధికా రుల పర్యవేక్షణ కరు వైందని ఆరోపణలు వెలువడుతు న్నాయి. ఏఈ శృతిని వివరణ కోరగా జీపి క్లియరెన్స్ జాప్యం వల్లనే ఆలస్యం అవుతున్నట్లు వివరణ ఇచ్చారు.



కందకాన్ని పూడ్చని పైప్‌లైన్

పనులను సత్వరం పూర్తి చేయాలి



కుడిది వేణుగోపాల్

కల్వచర్లలో జరుగుతున్న పైప్‌లైన్ పనులను సత్వ రం పూర్తి చేయాలి. రోడ్డు పక్కన గుంతలను పూడ్చకపోవడంతో ఇందిరమ్మ లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీని పై సకాలంలో అధికారులు స్పందించాలి

గుంతల మట్టితో ప్రమాదాలకు ఆస్కారం



- బుర్ర రాజుగౌడ్

పైప్‌లైన్ గుంతల వల్ల నిత్యం రాకపోకలకు ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. పైప్‌లైన్ పనుల కోసం తవ్విన గుంతల మట్టిని తిరిగినింపాలి. మట్టి రోడ్డు పై ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారు ల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు నత్తనడక కొనసాగుతున్నాయి.

గల్ఫ్‌లో గుంటపల్లిచెరువు తండా వాసి మృతి



రవి(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గుంటపల్లిచెరువు తండాకు చెందిన గుగులోతు రవి(43) సౌదీలో గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. గ్రామంలో రవి తనకున్న ఎకరం పొలంలో వ్యవసాయంతో పాటు దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. ఐదేళ్లక్రితం రూ.2లక్షలు అప్పు చేసి ఖతార్ వెళ్లాడు. అక్కడ సరైన పనిదొరకక వెళ్లిన ఆరునెలలకే ఇంటికి చేరుకున్నాడు. రెండేళ్ల క్రితం మరో రూ.5లక్షలు బాకీ చేసి కూతురు వివాహం జరిపించాడు. అప్పు తీర్చేందుకు యేడాది క్రితం రూ.3లక్షలు అప్పుచేసి సందర్శక వీసాపై సౌదీ దేశానికి వెళ్లాడు. అక్కడిగదిలో అస్వస్థతకు గురైన ఆయనను తోటి స్నేహితులు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రవి గుండెపోటుతో చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. శనివారం మరణవార్త తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా రోధిస్తున్నారు. మృతుడికి భార్య మంజుల, ముగ్గురు కూతుళ్లు స్రవంతి, చిట్టి, సోనా, కొడుకు దివాకర్ ఉన్నారు. కాగా భారత రాయబార కార్యాలయం, ప్రభుత్వం స్పందించి మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్య



రాకేష్(ఫైల్)

ధర్మపురి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని కాశెట్టి వాడకు చెందిన చెరుకు రాకేష్(33) అనేవ్యక్తి మానసిక వేదనకు గురై ఉరి వేసుకొని శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మపురి ఎస్‌ఐ జి.మహేష్ కథనం ప్రకారం.. చెరుకు రాకేష్‌కు ఐదుసంవత్సరాల క్రితం వివాహం కాగా భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. రాకేష్ నాలుగు నెలల క్రితం కువైట్ దేశం వెళ్లి అక్కడ పని దొరక్క వారం రోజులకే ఇంటికి తిరిగి వచ్చాడు. అప్పటినుంచి ఆర్థికంగా నష్టపోయానని తరచూ బాధపడు తుండేవాడు. శనివారం మధ్యాహ్నం తన బంధువైన కాశెట్టి నాగరాజు షాపునకు వెళ్తున్నానని చెప్పి ఇంటినుంచి బయలుదేరాడు. అనంతరం ఆ షాపులో ఉరి వేసుకొని మృతిచెందాడు. మృతుడి తండ్రి సత్యన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు.

సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

బోయినపల్లి డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో చేపట్టిన ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం బోయినపల్లి మండల పరిధిలోని రూసో కళాశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై జునైద్ మాట్లాడుతూ సైబర్ నేరాల నుంచి రక్షించుకోవాలంటే అవగాహన తప్పనిసరి అని అన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతను వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలని అనుమానాస్పద లింకులు, ఓటీపీ, బ్యాంక్ వివరాలు పంచుకోవద్దని సూచించారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తిగత సమాచారం, ఫొటోలను ఇతరులతో పంచుకోకూడదని సూచించారు. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా సైట్‌లను వాడేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఎక్కువ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏదైనా మోసం జరిగిన వెంటనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో నేర్చుకున్న విషయాల్ని ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో వాళ్లకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు కూడా సైబర్ నేరాల నియంత్రణలో తమవంతు పాత్ర పోషించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవేందర్, సంపత్, రాజ్ కుమార్, మౌనిక, సత్యం తదితరులు పాల్గొన్నారు.

తొలగించని సిల్ట్..

● బురద నీటితో నిండిన మురికి కాలువ

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొట్లపల్లి గ్రామంలో బురద నీటితో మురికి కాలువలు అపరిశుభ్రంగా మారాయి. ఈ కారణంగా దోమలు వృద్ధిచెందాయని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. మురికి కాలువల్లో చెత్త పేరుకుపోయినా పారిశుధ్య సిబ్బంది, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మురికి కాలువల్లో సిల్ట్ తొలగించి డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ప్రజలు పేర్కొంటున్నారు. అనారోగ్యాల బారిన పడక ముందే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



చెత్తతో అపరిశుభ్రంగా మారిన డ్రైనేజీ

● అమల్లోకి ఎన్నికల కోడ్

● నిఘా కోసం ప్రత్యేక బృందాలు



ముత్తారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) అమల్లోకి వచ్చింది. ఫలితంగా అన్ని పార్టీల నాయకులు పోటీకి సిద్ధమవుతున్న అభ్యర్థులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎన్నికలు జరగనున్న గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికలు ప్రక్రియ పూర్తయ్యే వరకు కోడ్ అమల్లో ఉంటుంది.

● పాటించవలసినవి..

కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో మంత్రులు అధికారిక పర్యటనలో ఎన్నికల ప్రచారంగా ఉపయోగించకూడదు. ఎన్నికల ప్రచారం సమయంలో ప్రభుత్వ వాహనాలు ఉపయోగించొద్దు. వాహనాలను అధికారిక పనులకే వినియోగించాలి. ఎవరైనా హోదాను దుర్వినియోగం చేస్తే అధికారిక వాహనాలను ఉపసంహరించుకునే అవకాశముంది. కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఎవరైనా కూడా ఎన్నికల విధుల్లో ఉన్న అధికారిని అధికారిక చర్చలకు కూడా పిలవకూడదు. స్థానిక ఎన్నికల సమయంలో వ్యక్తిగత పర్యటనకు వచ్చినా మంత్రులు అధికారులను పిలిస్తే వారు వెళ్తే నిబంధనలకు విరుద్ధంగానే భావించి ఎంసీసీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారు. అధికారంలో ఉన్న పార్టీలు సంక్షేమ పథకాల ముద్రణ, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రభుత్వ ఖర్చులతో ప్రచారం చేయొద్దు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రకటనలు, హోర్డింగ్‌లు వెంటనే తొలగించాలి. ఏదైనా పని మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదలైనా కోడ్ ముగిసే వరకు ప్రారంభించడానికి అనుమతి ఉండదు.

● ప్రచారంలో జాగ్రత్తలు వహించాలి

ఎన్నికల ప్రచార సమయంలో పార్టీ, అభ్యర్థులు ప్రస్తుతం ఉన్న విభేదాలను తీవ్రతరం చేయడం, పరస్పర ద్వేషభావాన్ని పెంపొందించేలా వ్యవహరించొద్దు. నిరాధర ఆరోపణలు చేయకూడదు. ఎన్నికల ప్రచారంలో ప్రార్థనా మందిరాలను వేదికగా చేసుకోవద్దు. లౌడ్ స్పీకర్ల ఉపయోగానికి సైతం అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

బస్ డ్రైవర్‌ను బెదిరించిన వ్యక్తిపై కేసు

వేములవాడ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సును ఈనెల 5వ తేదీన వేములవాడ మూలవాగు వంతెనపై ఆపి డ్రైవర్, కండక్టర్‌ను బెదిరించిన మూర్తి రెడ్డిపై శనివారం కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్‌ఐ రామ్మోహన్‌గౌడ్ తెలిపారు. ఈ సంఘటనపై ఆర్టీసీ కండక్టర్ బాలసాని స్వప్న, డ్రైవర్ మొగిలి వెంకటేష్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు విచారణ జరిపి బెదిరించిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

గొల్లపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం గంగాదేవిపల్లె గ్రామంలో కొలగాని రవి అనే మేకల కాపరికి చెందిన మేక ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తూ విద్యుదాఘాతంతో శనివారం మృతిచెందింది. శనివారం గ్రామరెవెన్యూ పరిధిలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అమర్చిన కంచెవద్ద మేక మేత మేస్తుండగా విద్యుదాతానికి గురై మృతిచెందినట్లు బాధితుడు పేర్కొన్నాడు. తనకు న్యాయం చేయాలని బాధితుడు రవి ప్రభుత్వాన్ని కోరాడు.

చోరీకి పాల్పడిన యువకుడి అరెస్టు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రంలోని మోటారు వైండింగ్ దుకాణంలో చోరీకి పాల్పడిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన యువకుడు మోతె సంతోష్‌ను అరెస్ట్ చేశామని ఎస్‌ఐ లక్ష్మణ్ శనివారం తెలిపారు. నిందితుడివద్ద నుంచి రూ.35వేల విలువైన బోరుమోటారు సామగ్రి స్వాధీనపర్చుకున్నామని పేర్కొన్నారు. వీర్నపల్లిలోని పర్లపల్లి బాబు దుకాణంలో నుంచి సంతోష్ వ్యవసాయ బోరు మోటారుతోపాటు సామగ్రిని ఎత్తుకెళ్లాడని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని పేర్కొన్నారు. చోరీ జరిగిన 24గంటల్లోనే నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ లక్ష్మణ్ వివరించారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ



చందుర్తిలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న నాయకులు

చందుర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ కోసం ఆత్మాహత్యకు పాల్పడిన సాయి ఈశ్వర్ ఆత్మకు శాంతి చేకూరాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి చందుర్తిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి కోరుట్ల రమేష్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కొరకు న్యాయం కావాలని కోరుతూ ఒక యువకుడు ప్రాణం తీసుకోవాల్సిన పరిస్థితి రావడం చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ తిప్తని శ్రీనివాస్,బీజీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు అమర బండ ప్రసాద్, నాయకులు వనపర్తి సతీష్, హమయ్య చారి, చిలక శ్రీనివాస్, మేడిశెట్టి జగన్, బత్తుల కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు వెల్లుల్ల విద్యార్థులు



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు వెల్లుల్ల విద్యార్థులు ఎంపికయ్యారు. 69వ స్కూల్ గేమ్స్‌ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంథనిలో జరిగిన బ్యాడ్మింటన్ అండర్-17 విభాగంలో బాలబాలికలు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు కొమురయ్య తెలిపారు. శనివారం జిల్లా నుంచి పాల్గొన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్లుల్ల బాలబాలికలు బబ్బిలి అక్షయ్, మాలేపు రిషికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవగా వారిని ప్రధానోపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

నంబర్‌ప్లేట్ లేని వాహనాలపై పోలీసుల కొరడా



పోలీసులకు పట్టుబడిన వాహనాలు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నంబర్ ప్లేట్స్ లేకుండా రోడ్లపై తిరుగుతున్న వాహనాలపై కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపించారు. కరీంనగర్‌లోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీస్ అధికారులు శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలలో సరైన నంబర్ ప్లేట్లు లేని 73 వాహనాలను గుర్తించారు. వాటి యజమానులపై మోటార్ వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించారు. జరిమానాలు విధించిన అనంతరం, ఆయా వాహనాలకు సరైన నంబర్ ప్లేట్లను బిగింపజేసి పంపినట్లు కరీంనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీముల్లాఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పౌరులు రోడ్డు భద్రతా నియమాలను, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

అభ్యర్థులందరికీ.. ఒకే గొంతు

● ప్రచారంలో సలీం గళం



వాయిస్ రికార్డింగ్ చేస్తున్న సలీం

సిరిసిల్ల, డిసెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): ఆయన మైక్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ బలపరిచిన అభ్య ర్థులను గెలిపించాలని అంటారు.. స్వతంత్రులకు ఓటెయ్యండి అంటూ ప్రచారం చేస్తాడు... గొంతు ఒక్కటే అభ్యర్థులు, పార్టీలు వేరు.. ఈ గొంతుప్రస్తుతం తెలంగాణ పంచా యతీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వినిపిస్తూనే ఉంటుంది. తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ ఏప్రాంతంలోనైనా శాసన సభ, పార్లమెంట్ ఏ ఎన్నికల్లో అయినా మారుమోగుతూనే ఉంటుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, వైసీపీ, బీఎస్పీ, జనసేన పార్టీలకు ఓటేద్దాం రండి అంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన సలీం గొంతుతో ప్రచారం సాగుతుంది. ఇప్పుడు పంచాయతీ ఎన్నికల్లోనూ వివిధ అభ్యర్థులకు ప్రచారం మొదలు పెటారు. అతను దాదాపు నాలుగు దశాబ్దాలుగా అందరు అభ్యర్థుల ప్రచారానికి ఆయన గొంతు అరువు ఇస్తూనేఉన్నాడు. సార్వత్రిక ఎన్నికలైనా.. స్థానిక ఎన్నికలైనా రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రానికి చెందిన ప్రచారకళాకారుడు ఎండీ సలీం గొంతు వినిపించాల్సిందే. సిరిసిల్లలోని లక్ష్మీ థియేటర్ రిక్షాలో కూర్చొని సినిమాల ప్రచారం కోసం 1974లో వినిపించిన సలీం గొంతు అందరినీ ఆకట్టుకుంది. సినిమా ప్రచారం, బీడీలు, లాటరీ టిక్కెట్లకు ఆయన ప్రచారం చేసేవారు. ఇలా సలీం గొంతు వివిధ కంపెనీల వారిని ఆకట్టుకుంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన భాగ్యలక్ష్మి లాటరీ టిక్కెట్ల అమ్మకాల ప్రచారంతో సలీం కంఠం రాష్ట్ర వ్యాప్తంగా మారుమోగింది. ఆడియో క్యాసెట్లు రావడంతో సలీం ప్రచారం మరింత ఊపందుకుంది. రాజమండ్రి పాలకోవా నుంచి హైదరాబాద్‌లో మార్కెట్లకి విడుదలయ్యే వస్తువుల ప్రచారానికి సలీం గొంతునే ఉపయో గించేవారు. వాణిజ్య ప్రచారాల నుంచి సలీం గొంతు రాజకీయ పార్టీలకు చేరింది. అన్ని పార్టీల వారు తమ ఎన్నికల ప్రచారానికి, ఆందోళన కార్యక్రమాల ప్రచారానికి సలీం గొంతుతోనే ప్రచారం చేసుకుంటున్నారు. మాతృభాష ఉర్దూ అయినా సలీం తెలుగులో అనర్గళంగా మాట్లాడుతారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతో పాటు చెన్నై, ముంబాయి, బీవండిలోనూ సలీం గొంతును ప్రచారానికి ఉపయోగించుకున్నారు. వృత్తి పరంగా రికార్డింగ్ సెంటర్, మైక్, టెంట్స్ సరఫరా చేసే సలీం, గాయకుడు ఘంటసాల గానం చేసిన పాటలను ఒక దగ్గర నిక్షిప్తం చేయాలన్న తపనతో ఘంటసాల కల్చరల్ ఆకాడమీ ఏర్పాటు చేశారు. 40ఏళ్లుగా ప్రచార రంగంలో తనకంటూ ఓ స్థానం కల్పించుకున్న సలీం ఆకాశవాణిలో ప్రత్యక్ష వాఖ్యానం, ఘంటసాల ఆలపించిన పాటలకు వ్యాఖ్యానం అందించారు. సలీం మైసూర్ యూనివర్సిటీ డాక్టరేట్‌తో పాటు కళాజ్యోతి, కళాసాగర్, రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాలను సైతం అందుకున్నారు. ప్రస్తుత పంచా యతీ ఎన్నికల్లోనూ అభ్యర్థులు ఆయన గొంతును ప్రచారాలకు ఉపయోగించుకుంటున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో

నలుగురికి గాయాలు

ముస్తాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామలక్ష్మణపల్లె వై జంక్షన్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కొండాపూర్ గ్రామానికి చెందిన చిగురు వెంకటయ్య, భార్య లక్ష్మీతోకలిసి ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో వారు వాహనంపై నుంచి కిందపడి పోయారు. వెంకటయ్యకు తీవ్ర గాయాలు కాగా ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని ఓప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. భార్యలక్ష్మీకి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం లింగన్నపేట పెద్దమ్మ ఆలయం మూలమలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కొత్తపల్లికి చెందిన దేవిరెడ్డి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదుపుతప్పడంతో ప్రమాదంజరిగింది. స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సిబ్బంది అక్కడికి చేరుకుని గాయపడ్డ దేవిరెడ్డిని గంభీరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

శంకరపట్నం: శంకరపట్నం మండలం తాడికల్‌లోని పెద్దమ్మతల్లి దేవాలయం వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాపడ్డారు. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా అబ్బాయికుంట లేబర్ కాలనీకి చెందిన కొండబత్తుల అనిల్‌కుమార్ అతడి కుమారుడు కొండబత్తుల ప్రదీప్‌తో కలిసి శనివారం ఉదయం వేములవాడ, కొండగట్టు అంజన్న దర్శనం చేసుకొని తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో తాడికల్ పెద్దమ్మతల్లి గుడి వద్ద లారీని ఓవర్టేక్ చేస్తూ ఎదురుగా వచ్చిన కారును ఢీ కొట్టాడు. ఈ ఘటనలో అనిల్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉండగా, అతడి కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలేవి?

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనేకచోట్ల అనుమతి లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తు భవనాలు, ఇళ్లను నిర్మిస్తున్నారని అనేక మంది ఫిర్యాదులు చేస్తున్నారు. వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. నగరపాలకసంస్థ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగానికి తమస్థలంలో వేరొకరు ఇళ్లు నిర్మిస్తున్నారని, తమపక్కన నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేస్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయి. అధికారులు వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో, మరికొందరు నేరుగా కమిషనర్‌ను, టౌన్‌ప్లానింగ్ అధికారులను కలిసి వినతి పత్రాలను సమర్పిస్తున్నారు. రోజుల కొద్దీ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మరికొందరు విసిగివేసారి కోర్టులను ఆశ్రయిస్తున్నారు. కొందరికి నోటీసులు జారీచేయడం, మరికొందరి ఫిర్యాదులను పరిశీలించి తాత్కాలికంగా పనులు నిలిపివేయడం, కొందరి భవన నిర్మాణసామగ్రిని తీసుకొచ్చి ఆ తర్వాత వదిలిపెట్టడం మినహా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. సమస్యను బట్టి ముడుపులు తీసుకొని నోటీసులిచ్చామని, చర్యలు తీసుకుంటామని సర్దిచెబుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జ్యోతినగర్‌కు చెందిన పీటర్ అనేవ్యక్తి తన నివాసాన్ని (2-10-1175) ఆనుకొని ఉన్న ఒకరు అనుమతులు, సెట్ బ్యాక్, పార్కింగ్ బహుళ అంతస్తు షాపింగ్ కాంప్లెక్సు నిర్మిస్తున్నారని, తనఇంటికి వెంటిలేషన్ లేకుండా పోతోందని ఆవేదన చెందాడు. 2025 జూన్ 23న మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించాడు. దీంతో ఆయన టౌన్‌ప్లానింగ్ డీసీపీకి పరిశీలించి చర్యలు తీసుకోవాలంటూ ఎండార్స్ చేస్తూ ఆయనను కలువాలని సూచించారు.

కమిషనర్ వెంటనే స్పందించడంతో తనకు న్యాయం జరుగుతుందని భావించానని, అయితే దాదాపు ఐదు నెలలుగా కార్యాలయం చుట్టూ, అధికారులచుట్టూ తిరుగు తున్నాచర్య తీసుకోలేదని ఆయన 'ఆంధ్రజ్యోతి'తో వాపోయాడు. ఎన్నోసార్లు అధికారులను కలిసినా వారు న్యాయం చేయక పోగా ఫిర్యాదు చేసిన వ్యక్తికి సపోర్టు చేస్తుండడంతో భవన నిర్మాణం జరుగుతోందని, దీనితో తనతోపాటు ఇరుగుపొరుగు ఇళ్లకు వెంటిలేషన్ లేకుండా పోతుందని తెలిపాడు. ఇప్పటికైనా అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే కట్టడాలపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరాడు. లేనిపక్షంలో కోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తానని తెలిపాడు. ఇలా ఎంతోమందికి జరుగుతున్న అన్యాయాలపై కమిషనర్ స్పందించి న్యాయం చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

● ఆందోళనలో ప్రయాణికులు

కథలాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలం దూలూరులో బొమ్మెనకు వెళ్ళే దారిలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉండడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. కొన్నేళ్లకిందట ఇక్కడ ఇళ్లులేని సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు పెరగడం వల్ల జనావాసాల మధ్య ట్రాన్స్‌ఫార్మర్‌తో ఇక్కట్లు ఎదురవుతున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తొలగించాలని లేదా రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



దూలూరులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

కాలేజీ గ్రౌండ్‌లో ఓపెన్‌జిమ్



జిమ్ చేస్తున్న వాకర్స్

మంథని, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం నుంచి జిమ్‌లో వాకర్స్ వినియోగించుకునేలా అందుబాటులోకి తెచ్చారు. దీంతోవాకర్స్ ఉత్సాహంగా జిమ్ చేశారు. వాకింగ్, జాగింగ్ కోసం గ్రౌండ్‌వచ్చే వారికోసం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసినట్లు మాజీసర్పంచ్ వొడ్నాల శ్రీనివాస్ తెలిపారు. త్వరలోనే ఈ జిమ్‌నుమంత్రి శ్రీధర్‌బాబుతో ప్రారంభోత్సవం చేయి స్తామన్నారు. ఓపెన్ జిమ్‌ను అందరు సద్వినియోగం చేసుకోవాలని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకరి కుమార్ కోరారు.

భద్రాచలం, పాపికొండలకు ప్రత్యేక బస్సు

భగత్‌నగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రల టూర్‌లో భాగంగా భద్రాచలం, పాపికొండలు వెళ్లేందుకు ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సును నడిపిస్తున్నట్లు కరీంనగర్-2 డిపో మేనేజర్ ఎం.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీన కరీంనగర్ బస్టాండ్ నుంచి రాత్రి 8 గంటలకు బస్సు బయల్దేరుతుందని పేర్కొన్నారు. 13వ తేదీ ఉదయం పాపికొండలు బోటింగ్ అనంతరం అదే రోజు రాత్రి భద్రాచలం, పర్ణశాల దర్శనం అనంతరం అదే రాత్రి వరకు కరీంనగర్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. పెద్దలకు రూ.1800, రూ.1300 చొప్పున చార్జి ఉంటుందని, వివరాలకు 9398658062, 8978383084, 9182610182 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మల్లన్న సన్నిధిలో హైకోర్టు జడ్జిల పూజలు




ఆలయంలో నందీశ్వరుడి వద్ద న్యాయమూర్తులు

ఓదెల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి క్షేత్రంలో శనివారం హైకోర్టు జడ్జిలతోపాటు జిల్లాలోని పలు కోర్టుల జడ్జిలు పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ముఖ్యఅర్చకుడు వారిని పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతించారు. అనంతరం మల్లికార్జునస్వామి, రామాలయంలో అర్చనలు నిర్వహించారు. ఆలయ ముఖ్య అర్చకులు భద్రయ్య, పంచాక్షరి, సిబ్బంది వారిని సన్మానించి ఆలయ జ్ఞాపికలను అందజేశారు. హైకోర్టు జస్టిస్‌లు పుల్ల కార్తీక్, అలిశెట్టి లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రావు, జిల్లా జడ్జిలు సునీత, గణేష్, వెంకటేష్, సచిన్‌రెడ్డి, సరిత, మంజుల, భవాని, సుధ, సంధ్యారాణి అలాగే డీసీపీ రామిరెడ్డి, ఏసీపి గజ్జికృష్ణ, ఎస్‌ఐ దీకొండ రమేష్, వకీళ్లు ఆకారపు సర్వోత్తమ్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు భవనానికి స్థల పరిశీలన..

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్‌లో జిల్లా కోర్టు భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని శనివారం హై కోర్టు జస్టిస్ లక్ష్మీనారాయణ సందర్శించారు. గ్రామంలోని సర్వే నెంబర్ 1072లో కేటాయించిన 10 ఎకరాల స్థలాన్ని పరిశీలించి, స్థలం వివరాలు, భవన నిర్మాణాలకు కేటాయించిన నిధులను న్యాయవాదులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునిత కుంచాల, పెద్దపల్లి డీసీపీ రామిరెడ్డి ,పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య , ఏసీపీ గజ్జి కృష్ణ తో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు.



పంచాయతీల్లో కీలకం.. ఉప సర్పంచ్

పలు గ్రామాల్లో ఆ పదవికి డిమాండ్

హుజూరాబాద్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవితో పాటు ఉప సర్పంచ్ స్థానం కూడా హాట్ కేక్ అవుతోంది. ఎన్నికల్లో అభ్యర్థులకు మద్దతు నిస్తున్న పార్టీలు ఒక సర్పంచ్ స్థానాన్ని మాత్రమే గెలుచుకోవడం వల్ల ప్రయోజనం లేదని, ఉప సర్పంచ్ స్థానాన్ని కూడా దక్కించుకుంటే గెలుపునకు పరిపూర్ణత సిద్ధిస్తుందని భావిస్తున్నాయి. ఇందుకోసం ఉప సర్పంచ్ స్థానాలపై ప్రధానంగా గురిపెడుతు న్నాయి. సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్‌ను కూడా కైవసం చేసుకోకపోతే పార్టీలు రాజకీయంగా ప్రతి కూలతలను ఎదుర్కోవలసి ఉంటుంది. ఉప సర్పం చ్‌కు చెక్ పవర్ ఉండడం ఈ పదవికి డిమాండ్‌ను పెంచింది. ఉప సర్పంచ్‌ను ఎన్నుకునేది వార్డు సభ్యు లే అయినందు వల్ల ఈ వార్డు సభ్యుల పదవులకు పోటీ తీవ్రంగా ఉంది. రాజకీయంగా పార్టీల నుంచి మద్దతు ఉన్న వారు వార్డు పదవుల్లో సైతం గట్టి పోటీ ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు.

● వార్డు సభ్యులే కీలకం..

ఎన్నికల్లో రిజర్వేషన్లు అనుకూలంగా రానిచోట్ల నాయకులు వ్యూహాలు మార్చుకుంటున్నారు. సర్పంచ్ కాకపోయినా చెక్‌పవర్ ఉన్న ఉప సర్పంచ్ పదవిని దక్కించుకుందామని పథకాలు రచించుకుంటున్నారు. సర్పంచ్ నుంచి వార్డు సభ్యుల వరకు అనువైన వారిని

● ఎన్నిక ఇలా...

సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల ఫలితాలు సాయంత్రంలోగా వెలువడుతాయి. ఆ వెంటనే ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహిస్తారు. ఉప సర్పంచ్‌గా పోటీ చేసేవారు ముందుగా నామినేషన్లు దాఖలు చేయడం, వారిని వార్డు సభ్యుల్లో ఒకరు బలపరచడం వంటి తతంగం ముగిసిన తర్వాత ఎన్నికను నిర్వహిస్తారు. వార్డు సభ్యులు చేతులెత్తడం ద్వారా ఎంపికను నిర్వహిస్తారు. ఎవరికి అనుకూలంగా ఎక్కువ మంది వార్డు సభ్యులు చేతులెత్తితే ఆ అభ్యర్థి గెలిచినట్లు ప్రకటిస్తారు. ఒకవేళ ఇద్దరికి సమాన ఓట్లు వస్తే టాస్ ద్వారా గెలుపును నిర్ణయిస్తారు.

● చెక్ పవర్‌తోపాటు అధికారాలు ఉండడం కారణం

ఎంపిక చేసేందుకు నేతలు రాత్రింబవళ్లు సమాలోచనలు చేస్తున్నారు. ఉప సర్పంచ్ కావాలంటే వార్డు సభ్యులే కీలకం కానున్నారు. దీంతో చెప్పిన మాట వినేవారితోనే నామినేషన్ వేయించినట్లు సమాచారం. 50 శాతం సర్పంచ్ స్థానాలు మహిళలకు కేటాయించారు. మహిళా సర్పంచులు గెలిచిన పంచాయతీల్లో ఉప స్పంచ్‌గా గెలుపొంది అధిపత్యం చేలాం ుంచవచ్చనే ఉద్దేశ్యంతో పలుకుబడి కలి గిన నేతలు వార్డు సభ్యులుగా బరిలోకి దిగారు. పాలకవర్గ సమావేశాలకు సర్పంచ్ గైర్హాజరు అయిన సందర్భాల్లో ఉప సర్పంచ్ అధ్యక్షతనే నిర్వహిస్తారు.

● ఉప సర్పంచ్ అధికారాలు

సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్‌కు కూడా విధులు, బాధ్యతలు ఉంటాయి. ఉప సర్పంచ్ గ్రామ పంచాయతీ సమావేశాల్లో పాల్గొనడం, సర్పంచ్‌కు సహాయం చేయడంతో పాటు సర్పంచ్ లేనప్పుడు పర్పంచ్ విధులను నిర్వహిస్తాడు. పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలు, సజావుగా జరిగేట్టు చూడడం, రోడ్లు, మురుగు కాలువలు, వంతెనలు, బావుల నిర్మాణం, నిర్వహణ వంటి ప్రజా పనులు సక్రమంగా జరుగుతున్నాయో లేదో పర్యవేక్షిస్తాడు. గ్రామాల్లో వీధి దీపాలను ఏర్పాటు చేయడం, వాటి నిర్వహణ బాధ్యతలను కూడా పర్యవేక్షిస్తాడు. పంచాయతీకి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాడు.

అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా వేముల లక్ష్మీప్రసాద్



బాధ్యతలు స్వీకరిస్తున్న వేముల లక్ష్మీప్రసాద్

కరీంనగర్ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు తొలి అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ (ఏడీఓపీ)గా వేముల లక్ష్మీ ప్రసాద్‌ను నియమిస్తూ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు శనివారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం లక్ష్మీప్రసాద్ రాజన్నసిరిసిల్ల జిల్లా కోర్టులో అడిషనల్ పబ్లిక్‌ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా వేముల లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ నేరస్థులకు శిక్షలు విధింపజేయడంలో పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమన్వయం అత్యంత ముఖ్యమన్నారు. కేసుల దర్యాప్తు దశ నుంచి కోర్టు వాదనలు పూర్తయ్యే వరకు కలిసి పనిచేస్తే నేరస్తులకు కచ్చితమైన శిక్షలు పడేలా చేయవచ్చన్నారు. లక్ష్మీ ప్రసాద్ నియమాకంపై కరీంనగర్ డిప్యూటీ డైరెక్టర్ అఫ్ ప్రాసిక్యూషన్ డి.శరత్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మంచికట్ల రాజేశం, మల్యాల ప్రతాప్ అభినందనలు తెలిపారు.

తెలంగాణను అగ్రగామిగా నిలుపుతాం

● మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైజింగ్ 2040 విజన్‌తో దేశంలోనే తెలంగాణను అగ్రగామి నిలుపుతామని రాష్ట్రరవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కి గ్లోబల్‌సమ్మిట్ ఆహ్వానపత్రికను అందజేశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రైజింగ్‌గ్లోబల్ సమ్మిట్‌కి బండిసంజయ్‌ని ఆహ్వానించినట్లు చెప్పారు. పెట్టుబడులు, ఇండస్ట్రియల్ గ్రోత్‌ను తెలంగాణ సమ్మిట్‌ద్వారా సాధిస్తామన్నారు. పదేళ్లలో తెలంగాణ ఆర్థికంగా వెనకబడిందని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరారు. కేంద్రప్రభుత్వం పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎక్కువ నిధులు ఇస్తోందని, అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాలని అన్నారు.



కేంద్రమంత్రి బండి సంజయ్‌కి ఆహ్వానపత్రికను అందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

రాజకీయాలకు అతీతంగా అన్నిపార్టీలు అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు.

● సాయి ఈశ్వర్ మృతి బాధాకరం..

బీసీరిజర్వేషన్లపై సాయిఈశ్వర్ మృతి బాధాకరమని మంత్రి పొన్నంప్రభాకర్ అన్నారు. ఇలాంటి బలిదానాలు ఎవరూ చేసుకోవద్దని కోరారు. సాయి ఈశ్వర్ కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామన్నారు. ఎవరు ప్రేరేపించినా మీరు బలిపశువులు కావద్దని సూచించారు.

● కులగణనకు కట్టుబడి ఉన్నాం

కులగణనకు కట్టుబడి ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. 50శాతం రిజర్వేషన్ దాటరాదన్న కేసును సుప్రీంకోర్టులో సవాల్ చేయబోతున్నామన్నారు. బలహీనవర్గాల సోషల్‌జస్టిస్ విషయంలో కాంగ్రెస్ చాంపియన్‌గా ఉందన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలకు వెళ్తున్నట్లు చెప్పారు. గ్రావ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడమంటే రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంమీద అందరంకలిసి కొట్లాడుదామని పిలుపునిచ్చారు. చలోడిల్లీ కార్యక్రమంలో కేంద్రప్రభుత్వం దద్దరిల్లేలా 50శాతంకోటఎత్తివేసేలా ఉద్యమించాలన్నారు. అంకుముందు చైతన్యపురిలోని మహాశక్తి ఆలయంలో పూజలుచేశారు. ఆయనవెంట ప్రభుత్వవిప్ ఆదిశ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేడిపల్లిసత్యం, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీసీ ఆచార్య ఉమేష్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, ఉన్నతశిఖరాలకు ఎదగాలని శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ఉమేష్‌కుమార్ అన్నారు. శనివారం యూనివర్సిటీ మైదానంలో యూనివర్సిటీస్థాయి అంతర్ కళాశాలలో పురుషుల వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపి విశ్వవిద్యాలయానికి పేరు తీసుకురావాలనారు. క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తాయని, స్నేహ సంబంధాలు పెంపొందుతాయని అన్నారు. ప్రతిభచాటిన క్రీడాకారులను ఈ నెల 10 నుంచి 14వరకు కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించనున్న దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలకు ఎంపికచేశారు. ఓఎస్‌డీ హరికాంత్, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి నజీముద్దీన్ మునావర్, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ మనోజ్ కుమార్, పీఆర్వో పీడీ విజయ్ కుమార్, వ్యాయామ అధికారులు దినేష్, నాగేశ్వర్‌రావు, శ్రీనాథ్, సతీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దంపేట ఎన్నిక నిలిపివేస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిజిల్లా రామగిరి మండ లం పెద్దంపేట గ్రామ పంచాయతీ ఎన్నికను నిలిపివేస్తూ శనివారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులను జారీ చేసింది. మొదటివిడత ఎన్నికల్లో భాగంగా ఈనెల 11న పెద్దంపేట పంచాయతీ ఎన్నికలు జరగాల్సి ఉన్నది. పెద్దంపేట పంచాయతీకి సంబంధించి హైకోర్టులో కేసు ఉన్నందున 11న ఎన్నికను నిర్వహించవద్దని ఎన్నికల కమిషన్ జిల్లా అధికారులకు ఉత్తర్వులు జారీచేసింది. ఈనెల 15న ఎన్నికపై తుదితీర్పు వెలువడనుండడంతో అప్పటివరకు ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని కమిషన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నది. కోర్టు తీర్పును అనుసరించి అనంతరం ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. దీంతో లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహహోమం, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నాగదేవతకు, రావి చెట్టు ఆంజనేయ స్వామివారికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు.

స్వామి వారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయం పక్కాన ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్,



ధర్మపురిలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



కొండగట్టు అంజన్న ఆలయం ముందు భక్తులు

ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ..

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకోని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయఅధికారులు పర్యవేక్షించారు. ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం వాహనాలతో నిండిపోయింది.

క్రీడలతో మానసికోల్లాసం

● అదనపు కలెక్టర్ రాజాగౌడ్

జగిత్యాల, డిసెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్ అన్నారు. శనివారం జగిత్యాలలోని స్థానిక వివేకానంద మినీ స్టేడియంలో జిల్లాస్థాయి పీఎంశ్రీ స్కూల్స్‌స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్, జిల్లావిద్యాశాఖ అధికారి కె.రాములు పాల్గొన్నారు. జిల్లాలోని 16పీఎంశ్రీ స్కూ ల్స్‌కి నిర్వహించిన కబడ్డీ, కోకో, వాలీబాల్, ఫుట్బాల్ ఆటలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్ మాట్లాడుతూ జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయి లోని పలు పోటీల్లో ప్రతిభ కనపరచి జిల్లాపేరును నిలబెడుతున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారులు చిప్ప సత్య నారాయణ, కొక్కుల రాజేష్, కోరుట్ల మహేష్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ చక్రధర్, పెటాఅధ్యక్షుడు విశ్వప్రసాద్,పిడుగు భాస్కర్, కృష్ణప్రసాద్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజాగౌడ్

సర్పంచ్ అభ్యర్థిపై ఫిర్యాదు

ఎలిగేడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లాలపల్లి గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీచేసేందుకు నామినేషన్ వేసిన సర్పంచ్ అభ్యర్థి ఏలేటి వెంకట్ రెడ్డిపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎంపీడీఓ భాస్కర్ రావుకు శనివారం ఫిర్యాదు చేసినట్లు మరో సర్పంచ్ అభ్యర్థి బాసంపల్లి రాజేష్ తెలిపారు. ఏలేటి వెంకట్ రెడ్డి ఇప్పటికే సింగిల్ విండో డైరెక్టర్‌గా కొనసాగుతున్నాడని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, మాజీ అధ్యక్షుడు తానిపర్తి మోహన్ రావు, నాయకులు న్యాతరి పోచయ్య, బద్దం తిరుపతిరెడ్డి, బాసంపల్లి వినోద్, సుజికి రాజేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు

ముత్తారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండలం ఓడేడు గ్రామంలో 6వ వార్డుకు వెళ్లే దారి ప్రమాదకరంగా మారింది. డ్రైనేజీ మీద నిర్మించిన రోడ్డు ఒకవైపు కూలి పెద్ద గొయ్యి ఏర్పడిరది. దీంతో ఈ వార్డుకు వెళ్లే వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ దారి గుండా వచ్చే కార్లు, ద్విచక్రవాహనాలు ఈ డ్రైనేజీలో పడి వాహనాలు దెబ్బతినడంతోపాటు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.



డ్రైనేజీపై ఏర్పడిన గొయ్యి

ఇప్పపల్లి రైతులతో ఆర్డీవో సమావేశం



ఆర్డీవోకు వినతి పత్రం అందిస్తున్న రైతులు

కథలాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పపల్లి రైతులతో శనివారం కోరుట్ల ఆర్‌డీఓ జివాకర్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహిలచారు. సూరమ్మ చెరువు ఎడమ కాలువ నిర్మాణంలో భాగంగా రైతులు భూములు కోల్పోతున్న నేపథ్యంలో నష్ట పరిహారం చెల్లింపుకుగాను ఆవార్డ్ ఎంక్వైరీ నిర్వహించారు. ప్రభుత్వ భూవిలువ ప్రకారం ఎకరాకు రు.8.60లక్షలు చెల్లించడానికి నష్టపరిహారం విడుదల చేసిందని రైతులకు సూచించారు. కాగా బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రు. 50 లక్షలు ధర ఉందని ఆ ధర చెల్లించాలని ఆర్‌డీఓకు రైతులు వినతి పత్రం అందజేశారు. అయితే నిర్ణీత డబ్బులు కోర్టులో డిపాజిట్ చేసి పనులు ప్రభుత్వం ప్రారంభిస్తుందని రైతులతో ఆర్‌డీఓ చెప్పారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వినోద్, రైతులు ఉన్నారు.

రక్త సంబంధీకుల నుంచి చట్టపరమైన దత్తత



పిల్లలను దత్తత తీసుకున్న దంపతులకు ఉత్తర్వులను అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రక్త సంబంధీకుల నుంచి పిల్లలను దత్తత తీసుకోదలిస్తే చట్టబద్ధంగా ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ-మిషన్ వాత్సల్య ఆధ్వర్యంలో కరీంనగర్‌కు చెందిన పిల్లలు లేని దంపతులు వారి రక్త సంబంధీకుల నుంచి 12నెలల బాబును చట్టపరమైన దత్తత తీసుకున్నారు. వీరికి కలెక్టర్ పమేలా సత్పతి శనివారం ఉత్తర్వులు అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలన్నారు. రక్త సంబంధీకుల నుంచి దత్తత తీసుకోవాలనుకునే వారు జిల్లా పరిషత్‌లోని జిల్లా సంక్షేమ అధికారికార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డీసీపీఓ) పర్వీన్, ఎల్‌పీవో రాజు, యం రాజ్ కుమార్, రమేష్, మిషన్ వాత్సల్య పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో మోడల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ



చేవెళ్లలో బహుమతి అందుకుంటున్న విద్యార్థి వెంకటేష్

వెల్గటూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో చేవెళ్లలో నిర్వహించిన ఇగ్నైట్-2025 సైన్స్ ఎగ్జిబిషన్‌లో వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థి సత్తా చాటాడు. రాష్ట్రవ్యాప్తంగా 194మోడల్ స్కూళ్లు పాల్గొన్న సైన్స్ ఎగ్జిబిషన్‌లో వెంకటేష్ అనే విద్యార్థి గైడ్ టీచర్ సందీప్‌రాజ్ సహాయంతో తయారు చేసిన ఉమెన్ సేఫ్టీ మిషన్‌కు కన్సోలేషన్ బహుమతి సాధించాడు. రాష్ట్రస్థాయిలో బహుమతి సాధించిన వెంకటేష్‌ను, గైడ్‌టీచర్ సందీప్‌రాజ్‌ను ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.



పల్లెల్లో ఊపందుకుంటున్న ప్రచారం

(5వ పేజీ తరువాయి)

పడుతున్నారు. చాలా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఇద్దరు, ముగ్గురు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఎంత బుజ్జగించినా కొంత మంది అభ్యర్థులు పోటీ నుంచి విరమించుకోలేదు. పోటీ బాగా ఉన్న చోట గెలిచే అభ్య ర్థులను తమ పార్టీలో చేర్చుకునేందుకు ఎమ్మెల్యేలు సంసిద్ధం అవుతున్నారు. కొన్ని చోట్ల గెలుస్తామనే ధీమా ఉన్న బీఆర్ఎస్ పార్టీకి చెందిన అభ్యర్థులు ముంద స్తుగానే అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నేతల టచ్‌లోకి వెళుతున్నట్లు సమాచారం. ప్రచారంలో భాగంగా ఇంటిల్లిపాది తిరుగుతూ ఓటు అభ్యర్థిస్తున్నారు. కుల సంఘాల నాయకులను కలుస్తూ వారి మద్దతు కూడ గట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. గ్రామాల్లో యువకులను ఆకర్షించేందుకు సైతం యత్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులు తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు గురించి వివరిస్తున్నారు. పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయిస్తామని హామీలు ఇస్తున్నారు. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన అభ్యర్థులు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల గురించి వివరిస్తున్నారు. కొందరు అభ్యర్థులైతే ఓటర్ల కాళ్లు మొక్కుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

● **ప్రచారం మొదలుపెట్టని ఎమ్మెల్యేలు, మాజీలు..**

జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే ఉండడంతో సదరు నాయకులు ఇంకా ప్రచార పర్వంలోకి దిగ లేదు. మంథనికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర ఐటీ, పరిశ్ర మల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బిజీ కావడంతో ఆయన ఎక్కువగా నియోజకవర్గానికి రావడం లేదు. ఆయన సోదరుడు శ్రీనుబాబు నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థులకు సూచనలు చేస్తున్నారు. ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్నికల ప్రచారం చేపట్టడం లేదు. మండలాల వారీగా అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మొదటి విడత ఎన్నికల ప్రచారానికి మరో మూడు రోజుల గడువు మాత్రమే మిగిలి ఉన్నది.

పూర్తయిన నామినేషన్ల పరిశీలన

సుల్తానాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మూడో విడత ఎన్నికల ప్రక్రియలో భాగంగా శనివారం నామినేషన్ల పరిశీలన ముగిసింది. సుల్తానాబాద్ మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉండగా గొల్లపల్లి సర్పంచ్ పదవికి ఒకే నామినేషన్ దాఖలైంది. మిగిలిన 26 సర్పంచ్ పదవుల కోసం 118 మంది అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటులో ఉన్నాయని ఎంపీడీఓ దివ్యదర్శన్ రావు తెలిపారు. 262 వార్డు స్థానాలకు బొంతకుంటపల్లి 3వ వార్డుకు ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు. మిగిలిన 246 వార్డు స్థానాలకు 245 స్థానాలకు 566 మంది నామినేషన్లు చెల్లుబాటులో ఉన్నాయని వివరించారు. 245 వార్డులకు అందులో 39 వార్డులలో ఒకే ఒక్క నామినేషన్ దాఖలైంది. వీరిని ఏకగ్రీవంగా ప్రకటించవచ్చు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో ఉపసంహరణలో సర్పంచ్ బరిలో 131, 294 వార్డు స్థానాలలో 712 మంది బరిలో ఉన్నట్లు ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్ తెలిపారు. శనివారం నిర్వహిచిన స్క్రూట్నీలో వార్డు సభ్యులు ఏకగ్రీవం అయినట్లు తెలిపారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. శనివారం మడిపల్లి కాలనీ, అంకంపల్లి, మడిపల్లి, ఆశన్నపల్లి, లక్ష్మీపూర్, రాయపట, పందిల్ల గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే పల్లె ప్రగతి సాధ్యమవుతుందని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలతోపాటు అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. పెద్దపల్లి ప్రజల చిరకాలవాంఛ బస్‌డిపోను సీఎం రేవంత్ రెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్నారని, మారో ఆరు నెలల్లో పూర్తవుతుందన్నారు. మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సదయ్య, పాల్గొన్నారు.

రిటైర్డ్ డీఎల్‌పీవో నామినేషన్

సుల్తానాబాద్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ పదవుల కోసం పలువురు ఉన్నత విద్యావంతులు, రిటైర్డు అధికారులు ఆసక్తి చూపుతున్నారు. గర్రెపల్లిలో సర్పంచ్ పదవి కోసం రిటైర్డు డివిజనల్ పంచాయతీ అధికారి మాదాసు రంగారావు స్వగ్రామం గర్రెపల్లిలో నామినేషన్ దాఖలు చేశారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి



పోలీసులతో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌ను శనివారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సందర్శించారు. స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో ఎన్నికల సరళి, నామినేషన్ కేంద్రాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ఎస్ఐ మల్లేష్‌ను అడిగి తెలుసుకున్నారు. సీపీ మాట్లాడుతూ రౌడీ షీటర్ల వివరాలు తెలుసుకొని వారి కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలని ఏసీపీ మడత రమేష్ సూచించారు. రామకృష్ణాపూర్‌లో గ్రామస్తులకు ఎన్నికల కోడ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ఎటువంటి ఆరోపణలకు, గొడవలకు, అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా ఎన్నికలు జరగాలని సూచించారు. ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం, బహుమతుల రూపంలో ప్రలోభాలు తీసుకోవడం చట్టపరంగా నేరమన్నారు. అభ్యర్థులు, మద్దతుదారులు ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. సిఐ బి.రాజు, ఎస్ఐ ఎన్.రవికుమార్ తదితరులున్నారు.

మంథనిరూరల్. (ఆంధ్రజ్యోతి): మండలంలో సర్పంచ్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఏసీపీ మడత రమేష్ కోరారు. మండలంలోని పుట్టపాక, అడవి సోమన్‌పల్లి, విలోచవరం, పోతారం గ్రామాల్లో పోలింగ్ స్టేషన్‌లో సందర్శిచారు. ప్రజలకు పలు సూచనలు అందజేశారు. సిఐ రాజు, ఎసైలు రమేష్, సాగర్‌లు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు సాధించే దిశగా సాధన చేయాలి



మాట్లాడుతున్న మనాలీఠాకూర్

కోల్‌సిటీటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా సాధన చేయాలని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని మక్కాన్‌సింగ్ సేవా సమితి అధ్యక్షురాలు మనాలీఠాకూర్ అన్నారు. శనివారం యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కుటుంబం- సమాజాభివృద్ధిలో విద్యార్థినుల పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆమె కళాశాల ఆవరణలో మొక్కలు నాటి విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. విద్యార్థినులు కుటుంబం, సమాజాభివృద్ధిలో ముఖ్య భూమిక పోషిస్తు న్నారని, అన్ని రంగాలలో పురుషులకు సమానంగా మహిళలు పనిచేస్తున్నారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇనుగాల మనోహర్ మాట్లాడుతూ విద్యార్థినులు తమకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ పీజీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇ.మనోహర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వైప్రసాద్, శ్యాంప్రసాద్, డాక్టర్ సుధా, డాక్టర్ అంబిక, డాక్టర్ రఘుపతి, రమ్య, రవీందర్, జ్యోతి పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కోల్‌సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రద్దీ ప్రాంతాల్లో శనివారం వన్ టౌన్ పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో బస్టాండ్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, లక్ష్మీనగర్ వ్యాపార సముదాయాలతో రమేష్ నగర్, అడ్డగుంటపల్లిలో తనిఖీలు చేశారు. నిత్యంరద్దీగా ఉండే దుకాణాల సముదాయాల వద్ద పార్కింగ్ చేసిన వాహనాల్లో బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. అనుమానం వచ్చిన వ్యక్తులు, బ్యాగులను సోదా చేశారు. సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు జరిగాయి.

కృష్ణవేణిలో ఫుడ్‌ఫెస్ట్



ఫుడ్ ఫెస్ట్‌లో కరస్పాండెంట్

రామగిరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కల్వచర్లలోని కృష్ణవేణి టాలెంట్ పాఠశాల, బేగంపేట్‌లోని సాయిప్రగతి విద్యానికేతన్‌లో ప్రీ-ప్రైమరీ విద్యార్థులచే ఫుడ్‌ఫెస్ట్ ను శనివారం నిర్వహించారు. వివిధ రకాల పిండి వంటకాలు, బిర్యానిలతో భోజనాలు చేశారు. సుమారు 4వందల మంది విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. కరస్పాండెంట్ తిరుపతిరెడ్డి, ప్రిన్స్‌పాల్ బర్లశ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సినీ డైరెక్టర్ సంపత్‌ను పరామర్శించిన ఈద

ఓదెల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన నందికిష్టయ్య కుమారుడు సినీ డైరెక్టర్ సంపత్ నందిని శనివారం కాడా మాజీ చైర్మన్ ఈద శంకర్ రెడ్డి పరమర్శించారు. అనంతరం కిష్టయ్య చిత్రపటానికి నివాళులర్పించి, మృతికి కారణాలను తెలుసుకున్నారు.

పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) మున్సిపల్ కార్మికుల ఆరోగ్యం మా బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం కరీంనగర్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్యం శిబిరం నిర్వహించారు. మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది, ఆఫీస్ సిబ్బందికి గుండెకు సంబంధించిన అన్ని రకాల పరీక్షలు నిర్వహించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్యం సిబ్బంది రోజూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే క్రమంలో ఎంతో కష్టపడుతున్నారని, వారి ఆరోగ్యం దృష్ట్యా మెడికల్ క్యాంపులు ఎంతో దోహదపడుతాయన్నారు. నిల్వ ఉన్న ఆహారపదార్థాలు, జంకు ఫుడ్స్ తీసుకోరాదని సూచించారు. ప్రస్తుతం చలి తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పారిశుధ్య కార్మికులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మేనేజర్ లింగయ్య, టౌన్ ప్లానింగ్ అధికారులు నరేష్ వినయ్, పాల్గొన్నారు.

కుసుమ శంకర్ ఎంపికపై హర్షం

ఎలిగేడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎలిగేడు గ్రామానికి చెందిన కుసుమ శంకర్ శనివారం జగిత్యాల జిల్లా ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా విజయం సాధించడంపై ఎలిగేడులో మిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ వైద్యవృత్తిలో తనకంటూ ప్రత్యేకతను చాటుకొని ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమని పేర్కొన్నారు. ముంజంపల్లి కొమురయ్య, శివపల్లి సత్యం, కోడూరి మల్లేశం, బుకాల సారయ్య అభినందించారు.

బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేసిన అంబేద్కర్







అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, మంథనిలో నివాళులర్పిస్తున్న పుట్ట మధు, అంబేద్కర్ విగ్రహనికి క్షీరాభిషేకం చేస్తున్న మనాలి ఠాకూర్

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ ఎనలేని కృషి చేశారని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఎస్‌సీ సెల్ అధ్యక్షుడు తాళ్లపల్లి యుగంధర్ ఆధ్వర్యంలో మున్సిపల్ టీ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలకు రిజర్వేషన్లను కల్పించిన ఘనత అంబేద్కర్‌కే దక్కుతుందన్నారు. బొంతల రాజేష్, కాల్వ లింగస్వామి, మహంకాళి స్వామి, మాదరబోయిన రవికుమార్, తిప్పారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి పౌరుడు కృషి చేయాలని ఎన్టీపీసీ, టీపీపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ అన్నారు. పీటీఎస్‌లో అంబేద్కర్ వర్ధంతిలో ఈడీ నివాళులర్పించారు. అంబేద్కర్ గొప్పనాయకుడని, ఆలోచనాపరుడని, సంఘసంస్కర్తని పేర్కొన్నారు. ఎన్టీపీసీ ఎస్‌టీ, ఎస్సీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు, ఎన్‌టీపీసీ టౌన్ షిప్ స్టేడియంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముకుల్ రాయ్, అవిజిత్ దత్తా, ముకుల్ రాయ్, విజయ్ కుమార్ సిగ్దర్, పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి) అంటరానితనం, కులత్వం సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి ప్రజా శ్రేయస్సు కోసం జీవితం అంకితం చేసిన మహనీయుడు అంబెద్కర్ అని ఏజీపీ ఉప్పు రాజు కొనియాడారు. అంబేద్కర్ వర్ధంతి పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలో అయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్ర కీలకమని, భారతదేశపు తొలి న్యాయశాఖ మంత్రిగా పని చేశారన్నారు. నాగుల ఓదెలు, బల్మూరి దేవేందర్ రావు, విశ్వనాథం, దుబాసి కుమార్, ,ఆసిఫ్, కాలీద్, అశోక్, చందు, తాళ్ళ కళ్యాణ్, రామారావు పాల్గొన్నారు

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. చంద్రయ్య, కొండయ్య, నారాయణ, న్యాతరి పోచయ్య, పాల్గొన్నారు.

పాలకుర్తి,అంతర్గాం (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ వర్ధంతిని ఈసాలతక్కళ్లపల్లిలో, అంతర్గాం మండలం టీటీఎస్‌లో నిర్వహించారు. ఆలిండియా అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షుడు మామిడిపెల్లి బాపయ్య అంబేద్కర్ విగ్రహనికి పూలమాలలు వేశారు. టీటీఎస్‌లో మక్కాన్ సింగ్ సేవసమితి చైర్‌పర్సన్ మనాలి ఠాకూర్ అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూల మాలలు వేశారు. దుర్గయ్య,రెడపాక రాములు,ఇండిపెల్లి రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): కల్వచర్ల, సెంటినరీకాలనీల్లో అంబేద్కర్ వర్ధంతిని వివిధ పార్టీల నేతలు నిర్వహించారు. కల్వచర్లలో రేండ్లశారదకు మారస్వామి, ఉద్యమకారుల సంఘం నాయకులు నూనేరాజేశం, బత్తుల శంకర్‌ల ఆధ్వర్యంలో విగ్రహానికి, చిత్రపటాలకు నివాళులర్పించారు. కళాధర్‌రెడ్డి, బత్తుల శంకర్, రాంచందర్, మొండయ్య, పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): పొత్కపల్లి, కనగర్తి, ఓదెల, గుంపుల తదితర గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. దొడ్డే శంకర్, మాటూరు వెంకటస్వామి, మల్లారెడ్డి, పుల్ల సదయ్య, కొంగరి అనిల్ తో పాటు దళిత, అంబేద్కర్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని రంగు సత్యనారాయణగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. పలువురు నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి కందుకూరి రాజరత్నం ముఖ్యఅతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆకునూరి బాలంకూస్, ఇరువురాల కిష్టయ్య, బొచ్చుశంకర్, మేకల సురేష్, పాల్గొన్నారు. ఆర్‌జీ-3లోని ఓసీ-1లో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతియాదవ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళర్పిం చారు. బొంకూరి మోహన్, బైరి రమేష్, కిషన్, పాల్గొన్నారు. ఆర్‌జీ-2 ఓసీపీ-3లోని ఎస్అండ్‌డి సెక్షన్‌లో నిర్వహించారు. శ్యాంసన్, కొంగర రవీందర్, రత్నాకర్‌రెడ్డి, శ్రీనాథ్, వేముల కిరణ్, పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేరుగు హన్మంతుగౌడ్ పిలుపునిచ్చారు. మున్సిపల్ టీ జంక్షన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు పిడుగు కృష్ణ, జక్కుల నరహరి, భూమయ్య, అపర్ణ, శివరాం, పాల్గొన్నారు. వీహెచ్‌పీ విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కోల్‌సిటీ, (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తౌటం సతీష్ అన్నారు. అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంజయ్ కుమార్, ఉమర్, కిషన్ రావు, పూర్మ శ్రీనివాస్, పెట్టెం శ్రీనివాస్, పాల్గొన్నారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): మచ్చుపేటలో అంబేద్కర్ వర్ధంతిని మాతంగి రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాగర్, అంజయ్య, శివతోపాటు తదితరులున్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని కాంగ్రెస్, బీఆర్ఎస్, దళిత సంఘాల నేతలు ప్రధాన చౌరస్తాలోని ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, తగరం శంకర్‌లాల్, ఏఎంసీ, పీఏసీఎస్ చైర్మన్లు కొత్త శ్రీనివాస్, కుడుదుల వెంకన్న, ఈఆర్‌సీ మెంబర్ శశిభూషణ్ కాచే, ఐలి ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు వేర్వేరుగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తామని వెల్లడించారు. వివిధ సంఘాల వారు సైతం నివాళులర్పించారు.



అంబేద్కర్ వర్ధంతిలో నాయకులు

ఈశ్వరాచారి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న బీసీ జేఏసీ

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) బీసీ రిజర్వేషన్ల కోసం హైదరాబాద్‌లో ఆత్మాహుతి చేసుకున్న ఈశ్వరాచారి కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉషా డిమాండ్ చేశారు. శనివారం కలెక్టర్ కోయ శ్రీహర్షను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ నల్గొండ జిల్లా కేంద్రంలో జనరల్ స్థానంలో పోటీకి నామినేషన్ వేసిన బీసీ అభ్యర్థి భర్తపై జరిగిన అనాగరిక సంఘటన సభ్య సమాజానికి సిగ్గుచేటన్నారు. బీసీ రిజర్వేషన్లను కోరుతూ ఈశ్వరాచారి ఆత్మబలిదానం తీవ్రంగా కలచి వేసిందన్నారు. బీసీ జేఏసీ వైస్ చైర్మన్ కొండి సతీష్, జిల్లా కన్వీనర్లు సలేంద్ర కొమురయ్య, సిరవేని స్వప్న, మిట్టపల్లి శ్రీనివాస్, కలవేని రవి, విశ్వకర్మ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మదర్‌థెరిస్సాలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆవిష్కరణ



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సతీష్‌రెడ్డి

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెద్దబొంకూర్ మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కార్యక్రమాన్ని డాక్టర్ సతీష్‌రెడ్డి ఆవిష్కరించారు. కళాశాల డైరెక్టర్ నవత మాట్లాడుతూ సెంటర్ ద్వారా ఇండస్ట్రీ అకాడమిక్ రీసెర్చ్ ప్రభుత్వాన్ని అనుసంధానం చేస్తూ విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఎమర్జింగ్ టెక్నాలజీపై శిక్షణను ఇచ్చి ఉద్యోగం కల్పించే దిశగా కోర్సులు నిర్వహిస్తారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, రీసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ సీఈవో నాగేందర్, అకౌంట్స్ ఆఫీసర్ పవన్‌కుమార్, విభాగాధిపతులు వంశీరాజ్, శ్రీధర్ సంతోష్ , శశికాంత్, జయంత్‌రెడ్డి , రమేష్, రమ్య, సవిత పాల్గొన్నారు.

ముఖగుర్తింపు హాజరును స్వాగతిస్తున్నాం

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగులకు ప్రవేశ పెట్టనున్న ముఖ గుర్తింపు హాజరు విధానానికి స్వాగతిస్తున్నట్లు సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తిప్పని తిరుపతి, రాష్ట్ర నాయకులు కుంభాల సుధాకర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం హామీ మేరకు జీతాల పెంపు, పే స్కేల్, ఉద్యోగ భద్రత అమలు చేస్తూ ముఖగుర్తింపు హాజరు విధానాన్ని అమలు చేయాలని కోరుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో విద్యాశాఖ అభివృద్ధికి సేవలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేయాలని, సమాన పనికి సమాన వేతనం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. రహీమోద్దిన్, శ్రవణ్, శ్రీనివాస్‌లు ఉన్నారు.

జీడీకే 1ఇంక్లైన్‌లో భద్రత పక్షోత్సవాలు



మాట్లాడుతున్న జీఎం లలిత్ కుమార్

గోదావరిఖని, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రామగుండం రీజియన్‌లో మొదటగా ప్రారంభమైన జీడీకే 1ఇంక్లైన్‌లో ప్రమాదాల స్థాయిని జీరో లెవల్‌కు తగ్గించేందుకు చర్యలు చేపట్టారు. బొగ్గు గనుల నియంత్రణ చట్టం-2017 సవరణ తరువాత బొగ్గు గనుల్లో కొత్త నియామకాలు ఎక్కువగా జరుగడంతో ఉద్యోగులకు భద్రతపై పూర్తి అవగాహన కల్పించాలని డీజీఎంఎస్ ఆదేశించింది. ఈ మేరకు 1ఇంక్లైన్‌లో భద్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు ప్రమాదాల స్థాయిని సున్నాకు తగ్గించాలనే ఆలోచనతో పని చేస్తున్నట్టు మేనేజర్ సుధీర్ జకుల్‌వార్ పేర్కొన్నారు. జీఎం లలిత్ కుమార్, ఏజెంట్ రమేష్, మేనేజర్ సుధీర్ జకుల్‌వార్, సేఫ్టీ ఆఫీసర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పడిపూజ

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాత్రి అయ్యప్ప పడిపూజ మహోత్సవాన్ని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మనాలీ ఠాకూర్ దంపతులు నిర్వహించారు. వేద పండితులు, అయ్యప్ప భక్తులు హాజరై స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రామగుండాన్ని టెంపుల్ టౌన్‌గా, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. బీ పవర్‌హౌస్ వద్ద 108అడుగుల ఆంజనేయాద్రి విగ్రహంతో పాటు సమ్మక్క-సారలమ్మ జాతర ప్రాంగణం అభివృద్ధి, గోదావరి తీరం వెంట ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు.

నేరాల నియంత్రణపై అవగాహన

జ్యోతినగర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ విశ్వభారతి హైస్కూల్‌లో శనివారం నేరాల నియంత్రణలో పోలీసుల భాగస్వామ్యం అంశంపై విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. పాల్గొన్న ఎస్ఐ ఉదయ్ కిరణ్ సైబర్ నేరాలు, గంజాయి, డయల్ 100 అంశాలను వివరించారు. సమాజంలో జరిగే తప్పుల వైపు విద్యార్థులు వెళ్లవద్దని, చెడుకు బానిసలుగా మారవద్దని అన్నారు. పాఠశాల చైర్మన్ బండారపు యాదగిరి గౌడ్, హెచ్ఎం బండారపు తిరుపతిగౌడ్, ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

పాలకుర్తి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): ఫ్యుట్యూర్ గ్లోబల్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కరస్పాండెంట్ బుర్ర సత్యం గౌడ్,ప్రిన్సిపాల్ జి సతీష్ కుమారులు మాట్లాడుతూ విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు మాక్ పోల్ నిర్వహించామన్నారు. ఈ పోలింగ్‌లో 6,7 తరగతుల విద్యార్థులు అభ్యర్థులుగా పోటీలో ఉన్నారని, 4,5వ తరగతుల విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం,ఉపాధ్యాయులు ఓటింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. ఇన్‌చార్జి శ్రీరాముల లావణ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక

రామగిరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):రాష్ట్రస్థాయిలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో సెంటినరీకాలనీకి చెందిన వాణి పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. 9వ తరగతి విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపియ్యారు. లోకాస్ట్ డెఫ్ హియరింగ్ ఎయిడ్ హెల్త్ విభాగంలో ప్రదర్శనలో ప్రథమ బహుమతి సాధించింది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ప్రియదర్శిని తెలిపారు. ఎండి సిద్దిక్ తయారు చేసిన డిజిటల్ డిస్టెన్స్ కెలిక్యూలేటర్‌కు ద్వితీయ బహుమతి సాధించినట్లు పేర్కొన్నారు. పాఠశాల వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, అభినందించారు.

గుంతలను పూడ్చిన పోలీసులు

మంథని, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంథని-గోదావరిఖని ప్రధాన రహదారిపై పలు చోట్ల ప్రమాదకరంగా ఉన్న గుంతలను పోలీసులు శనివారం పూడ్చి వేశారు. పలు చోట్ల పెద్ద గుంతలు పడి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని ఏసీపీ పూడ్చటానికి చర్య తీసుకోవాలని ఎస్ఐ డేగ రమేష్‌ను ఆదేశించారు.